## క్లుప్తంగా

### నిర్ణీత గడువులో రీ సర్వే పూర్తి చేయాలి



సర్వేయర్లతో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

కాకినాడ సిటీ: జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష రీ సర్వేకి సంబంధించి సర్వేయర్లతో డివిజనల్ స్థాయి సమావేశం మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో బీవీ రమణ నిర్వహించారు. సర్వేయర్లు రోజువారి లక్ష్యాలు నిర్దేశించుకుని నిర్ణీత గడువులో రీ సర్వే పూర్తి చేయాలన్నారు. ఇందుకు రోవర్లు సిద్ధం చేసుకోవాలని, అలాగే సర్వే దరఖాస్తులు నిర్ణీత గడువులో పరిష్కరించాలన్నారు. ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ బీబీబీ రాజు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ పాపారావు, డివిజన్ సర్వేయర్లు పాల్గొన్నారు.

**భూ సర్వే పరిశీలన**

కాకినాడ రూరల్: జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష రీ సర్వేకి సంబంధించి మండలంలోని పండూరు, సర్పవరం గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేను ఆర్డీఓ బీవీ రమణ మంగళవారం పరిశీలించారు. రెండు గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో రీ సర్వే వివరాలను తహసీల్దార్ మురార్జీ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్డీఓ రమణ మాట్లాడుతూ రూరల్ మండలంలో 12 రెవెన్యూ గ్రామాల్లో ఈ రీసర్వే పూర్తయిన నేపథ్యంలో శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకున్నామన్నారు. 4962 ధ్రువ పత్రాలు పంపిణీ చేశామని, 62 వేల పత్రాలు పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### పారిశుధ్య పనుల పర్యవేక్షణ

కాకినాడ సిటీ: స్థానిక జగన్నాథపురం విష్ణాలయం వీధి, దేవాలయం వీధి, ప్రాంతాల్లో నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ మంగళవారం పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. తడి-పొడి చెత్త సేకరణ, ఇంటింటికీ చెత్త సేకరణను పరిశీలించారు. ప్రజలు సహకారంతోనే నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దగలమన్నారు. డ్రైనేజీల్లో పూడికను గుర్తించి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు.

### వైఎస్సార్ సీపీ నాయకుడు వాసు మృతి



వాసు (ఫైల్)

కాకినాడ: వైఎస్సార్ సీపీ 40–ఎ డివిజన్ కన్వీనర్, సీనియర్ నాయకుడు కలగా వాసు (56) మంగళవారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అస్వస్థతో ఉన్న ఆయన ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పార్టీ కార్యకలాపాల్లోనూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చురుకైన పాత్ర వహిస్తున్నారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్న తరఫున ఆయన డివిజన్‌లో కీలకపాత్ర వహిస్తున్నారు. ఆయన మృతికి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు. పార్టీ పట్ల క్రమశిక్షణ, అంకిత భావంతో పనిచేసే ఓ చురుకైన కార్యకర్తలను కోల్పోయామని ఆయన పేర్కొన్నారు. కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర విద్యాసాగర్, కార్పొరేటర్ నల్లబెల్లి సుజాత, రాగిరెడ్డి బన్ని, నాయకులు, కార్యకర్తలు భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు.

### మరిడమ్మకు బంగారు పుష్పాలతో పూజ



స్వర్ణ పుష్పాలతో అమ్మవారు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ అమ్మవారికి మంగళవారం మఖ నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, హోమాలతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### సముద్రంలో యువకుడి గల్లంతు



రిత్విక్ (ఫైల్)

పాయకరావుపేట (అనకాపల్లి జిల్లా): మండలంలోని పెద్దూరు సముద్ర తీరంలో స్నానం చేస్తుండగా ఓ యువకుడు గల్లంతైనట్టు ఎస్సై బి.జోగారావు తెలిపారు. కాకినాడ మధురానగర్‌కి చెందిన గుమ్మడి రిత్విక్ (24) సోమవారం సాయంత్రం స్నేహితులతో సముద్ర స్నానానికి వెళ్లాడు. స్నానం చేస్తుండగా అలల తాకిడికి మునిగిపోయినట్టు ఎస్సై తెలిపారు. రిత్విక్ బీటెక్ చదువుతున్నాడని, అతని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

# సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- 24వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం



ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారుకు వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ సిటీ: ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందజేస్తున్నారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం నగరంలోని 24వ డివిజన్‌లోని పద్మనాభనగర్, అన్నమ్మ చెరువు ప్రాంతాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, కమిషనర్ కె.రమేష్, అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్‌లతో కలిసి నిర్వహించారు. మూడున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం ఆయా కుటుంబాలకు చేకూర్చిన లబ్ధిని ప్రజలకు వివరిస్తూ, లబ్ధికి సంబంధించిన బుక్‌లెట్లను ఆయన పంపిణీ చేశారు. పథకాల పంపిణీలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గడపగడపకూ ప్రభుత్వం ద్వారా నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని ఆకాంక్షించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉండడం వల్ల ప్రజలకు అన్ని విధాల మేలు జరుగుతుందన్నారు. ప్రజల ప్రతి కష్టానికి ఒక్కొక్క పథకాన్ని అమలు చేస్తూ, పేదరిక నిర్మూలన దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు. టీడీపీ, జనసేన వంటి పార్టీల తప్పుడు వాగ్దానాలను నమ్మొద్దన్నారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం ఏసుబాబు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్‌వో మానే కృష్ణమోహన్, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు నల్లబిల్లి సుజాత, కర్రి శైలజ, సంగాని నందం, కామాడి సీత, నగర బీసీ సెల్ అధ్యక్షుడు పేర్ల రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు

కమిషనర్ రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రమేష్

కాకినాడ సిటీ: ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు నోడల్ ఆఫీసర్లు ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో అదనపు కమిషనర్ నాగనరసింహారావుతో కలిసి కాకినాడలోని నోడల్ ఆఫీసర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సచివాలయ ఉద్యోగుల హాజరు, మెరుగైన పాలన, పనితీరు దిశగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు, సంతృప్తికరమైన సమాధానం వచ్చేలా చూడాలన్నారు. ప్రజలకు దగ్గరగా ప్రభుత్వ పరిపాలన అందాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ లక్ష్యానికి అనుగుణంగా ఉద్యోగులు పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 10వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ రమేష్ తెలిపారు. ఆధార్‌లో మార్పులు చేర్పులకు అవకాశం ఉన్నందున ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చైతన్యవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్‌వో మానే కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు



ఆధార్ నమోదు కేంద్రంలో సర్పంచ్ సత్యనారాయణ ఆధార్ అప్‌డేషన్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ నారాయణమూర్తి

కాకినాడ రూరల్: ఆధార్ కార్డులలో మార్పులు, చేర్పులు, సవరణల కోసం డివిజన్ పరిధిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి తెలిపారు. డివిజన్‌లో 37 గ్రామ సచివాలయాల్లో మంగళవారం నుంచి ఈ నెల 10 వరకు ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామని, 5 నుంచి 15 ఏళ్ల పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేషన్, ఫోన్ నంబరు ఆధార్ లింక్ చేయడం, ఇతర అప్‌డేషన్లను నిర్వహిస్తామన్నారు. రమణయ్యపేట సచివాలయం–2లో ఆధార్ కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేసి సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచలు ఇచ్చారు.

**తిమ్మాపురంలో..**

తిమ్మాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆదార్ నమోదు కేంద్రాన్ని డీఎల్‌డీఓ పరిశీలించారు. గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి కర్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- ఆర్డీఓ బీవీ రమణ
- డివిజన్ స్థాయి అధికారులతో సమీక్ష



డివిజన్ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

కాకినాడ సిటీ: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసీ, పీఎన్‌డీటీ) చట్టం పటిష్ఠ అమలుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆర్డీవో బీవీ రమణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం–1994 అమలుపై డివిజన్ స్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన స్కానింగ్ సెంటర్లు 101 ఉన్నాయని, ఇందులో 10 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్నాయన్నారు. అల్ట్రా సౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్టరీత్యా నేరమని, నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలో గత ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు 43 డెకాయ్ ఆపరేషన్లు చేపట్టినట్లు తెలిపారు. ఒక్క జనవరి నెలలోనే ఎనిమిది డెకాయ్ ఆపరేషన్లు, 11 ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. డివిజన్ స్థాయి ప్రోగ్రామ్ అధికారులు, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పరిధిలోని లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల పరిధిలో చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. స్కానింగ్ సెంటర్లపై ఫిర్యాదుకు 18004253365 టోల్‌ఫ్రీ నంబరు అందుబాటులో ఉన్నట్లు ఆర్డీవో రమణ తెలిపారు. అవగాహన కార్యక్రమాల్లో ఏఎన్‌ఎం, ఆశా, అంగన్‌వాడీ సిబ్బందిని భాగస్వాములను చేయాలని ఆదేశించారు. జీజీహెచ్‌లో గర్భిణులకు అందుబాటులో ఉన్న సేవలపై అగాహన పెంపొందించి, ఆ సేవలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆర్డీవో సూచించారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్ ఎల్.పావని, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.కృష్ణారావు, డాక్టర్ నూరున్నిసా బేగం, ఎన్‌జీవో ప్రతినిధులు కె.సింహాద్రి, కాకినాడ డివిజన్ సీడీపీవోలు పాల్గొన్నారు.

## రోటరీ సేవలు చిరస్మరణీయం



ట్రైసైకిళ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక రోటరీ క్లబ్‌లో మంగళవారం క్లబ్ ఆధ్వర్యంలో 10 మంది లబ్ధిదారులకు ట్రైసైకిళ్లను ఆయన అందించారు. సేవా కార్యక్రమాల నిర్వహణలో రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అభినందనీయమన్నారు. తాను చేసిన విజ్ఞప్తికి క్లబ్ అధ్యక్షుడు జీవీ కృష్ణప్రకాష్‌తో పాటు సభ్యులు సకాలంలో స్పందించి రూ.90 వేలు విలువైన పది ట్రైసైకిళ్లను అందించేందుకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. క్లబ్ అధ్యక్షుడు కృష్ణప్రకాష్ ఆర్థిక సహకారం అందించిన లంక సాయిబాబా, కాదా వెంకటరమణ, నయన శ్రీరామ్, నేతి నాగేశ్వరరావు, టీవీ గోపీనాథ్, ముంజులూరి విశ్వేశ్వరరావు, చోడిశెట్టి పద్దరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను క్లబ్ సభ్యులు గజమాలతో సత్కరించారు.

# నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానం హర్షణీయం

- 'ధన్వంతరి' సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గోపాలకృష్ణ
- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న గోపాలకృష్ణ, కురసాల సత్యనారాయణ తదితరులు

కాకినాడ రూరల్: దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల ట్రస్ట్ బోర్డు సభ్యుల నియామకాల్లో నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తమ సామాజికవర్గానికి సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తూ ఆ వర్గీయులు క్షీరాభిషేకాలు చేశారు. ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో రమణయ్యపేట వైద్యనగర్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు క్యాంపు కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలో బీసీలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు సుందరపల్లి గోపాలకృష్ణ, కొమ్మన తాతారావు, కోట ఉమా అచ్యుత రమణ, వీరబాబు, వీర మాణిక్యం, కృష్ణ, తదితరులు పాల్గొని సీఎంకు ధన్యవాదాలు తెలియజేశారు.

## 10న రాజానగరంలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: తూర్పు గోదావరి జిల్లా రాజానగరంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు మంగళవారం తెలిపారు. వికాస, రాజానగరం బర్ల సుబ్బలక్ష్మి డిగ్రీ కాలేజీ సంయుక్త ఆధ్వర్యాన ఈ మేళా జరుగుతుందన్నారు. సుమారు 14 కంపెనీల్లో 800 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. సమీర్ ఆగ్రో ఇండస్ట్రీస్, ఐడీఈఎఫ్, నిట్ (ఐసీఐసీఐ బ్యాంక్), ఇండిగో ఎయిర్‌లైన్స్, కోజెంట్ ఈ–సర్వీసెస్, డెక్కన్ కెమికల్స్, ఏపీ టైర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ, హోండాయ్ మోబీస్ తదితర సంస్థల్లో వివిధ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయని వివరించారు. 5వ తరగతి నుంచి టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, ఏపీహెచ్‌డబ్ల్యూ, బీఎస్సీ, నర్సింగ్ ఉత్తీర్ణులైన 45 ఏళ్ల లోపు అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆ రోజు ఉదయం 9 గంటలకు రాజానగరం బర్ల సుబ్బలక్ష్మి డిగ్రీ కాలేజీ వద్దకు సర్టిఫికెట్ల జిరాక్సులతో హాజరు కావాలని లచ్చారావు సూచించారు.

## అన్నవరం ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా భామిరెడ్డి



కర్రి భామిరెడ్డి

కాకినాడ: అన్నవరం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులుగా కాకినాడకు చెందిన కర్రి భామిరెడ్డి తిరిగి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. 2020లో ట్రస్ట్‌బోర్డు సభ్యుడిగా నియమితులైన ఆయనకు రెండవసారి అవకాశం దక్కింది. భామిరెడ్డి కుటుంబానికి అన్నవరం దేవస్థానంతో సుదీర్ఘ అనుభవం ఉంది. ఆయన తాతగారైన కర్రి భామిరెడ్డి జమిందార్ నిత్యాన్నదానం కోసం అన్నవరం దేవస్థానానికి 40.16 ఎకరాల భూమిని దానంగా ఇచ్చారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మామగారైన భామిరెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షునిగా, కాకినాడ అసోసియేషన్ చీఫ్ పేటరన్‌గాను, పీఆర్ ప్రభుత్వ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ గౌరవాధ్యక్షుడిగా కూడా పనిచేస్తూ అనేక సామాజిక సేవల్లో చురుగ్గా పనిచేస్తున్నారు. భామిరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ అన్నవరం దేవస్థానంలో భక్తులకు మెరుగైన సేవలు కలిపించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులకు ఆయన ధన్యవాదాలు చెప్పారు. భామిరెడ్డిని కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

## రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కాకినాడ సిటీ: కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా రవాణా రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య విమర్శించారు. మంగళవారం టీచర్స్ హోంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 2014–22 మధ్య కాలంలో పెట్రోలియం ఉత్పత్తులపై మోడీ ప్రభుత్వం రూ.20 లక్షల కోట్ల పన్నులను వసూలు చేసిందన్నారు. ఇదే కాలంలో 11.72 లక్షల మంది వివిధ రోడ్డు ప్రమాదాల్లో చనిపోయినా బాధితులకు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా తీవ్ర అన్యాయం చేసిందని, తక్షణమే రవాణా రంగ కార్మికుల సామాజిక భద్రత కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించి సెలవులు, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని, పరిశ్రమలలోని వాహనాలపై డ్రైవర్లుగా స్థానికులకే అవకాశాలు ఇవ్వాలన్నారు. 104, 108 వాహనాల్లో పని చేసే డ్రైవర్లకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. సీఐటీయూ నాయకులు శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, పలివెల వీరబాబు, వాసంశెట్టి శ్రీనివాస్, రమేష్, గంగాధర్, తాతపూడి మూర్తి, నెల్లిపూడి సత్యనారాయణ, కొప్పిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# జడ్జి పదవి మరింత బాధ్యతాయుతమైనది



జూనియర్ సివిల్ జడ్జి కందికట్ల రాణిని సత్కరిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు



స్వర్ణను సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం, న్యాయవాదులు



మైలబత్తుల దేవస్త దీపికను సత్కరిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు

- జిల్లా జడ్జి కమలాదేవి
- నూతనంగా ఎంపికైన న్యాయమూర్తులకు సత్కారం

కాకినాడ లీగల్: జడ్జిలుగా ఎంపికైన తర్వాత మరింత బాధ్యత పెరుగుతుందని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి నూతనంగా ఎంపికైన జడ్జిలకు సూచించారు. మంగళవారం స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఇటీవల న్యాయమూర్తులుగా ఎంపికైన ముగ్గురు న్యాయవాదులకు దుశ్శాలువ, మెమెంటోతో సత్కరించారు. అదనపు జిల్లా జడ్జిలు కమలాదేవి, హరి నారాయణ మాట్లాడుతూ పట్టుదలతో చదివి న్యాయమూర్తులైన వారు మరింత బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు.

ఎంపికైన ముగ్గురు న్యాయమూర్తులలో కందికట్ల రాణి శ్రీకాకుళం అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే గొడ్ల స్వర్ణ, మైలబత్తుల దేవస్త దీపికలకు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. ఎంపికైనవారు ముగ్గురు మాట్లాడుతూ తమ గురువులు, సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్‌లో న్యాయశాస్త్రంపై అవగాహన కల్పించడం తమకు ఎంతో ఉపయోగపడిందన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు నరహరిశెట్టి రవికృష్ణ, జనరల్ సెక్రటరీ కె.శంకుసింగ్, ఉపాధ్యక్షుడు కేబీ ప్రతాప్ కుమార్, జాయింట్ సెక్రటరీ సుదీన శ్రీనివాస్, మహిళా ప్రతినిధి వసంత, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రాణాంతక వ్యాధిగ్రస్తులను ఆదరించాలి

- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి
- 'కోవిడ్–ఎయిడ్స్–నేను' పుస్తకం ఆవిష్కరణ



ఎమ్మెల్యేకు పుస్తకాన్ని అందజేస్తున్న డాక్టర్ మురళీకృష్ణ

కాకినాడ సిటీ: కోవిడ్, ఎయిడ్స్ వంటి వ్యాధులతో బాధపడే వారిని వైద్యులు, ప్రజలు ఆదరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం జగన్నాథపురంలో ప్రముఖ సాంక్రమిత వ్యాధుల నిపుణులు డాక్టర్ యనమదల మురళీకృష్ణ రచించిన కోవిడ్–ఎయిడ్స్–నేను అనే పుస్తకాన్ని ఆయనకు అందజేసిన సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం తీసుకున్న అవగాహన చర్యలతో కొత్తగా హెచ్‌ఐవీ బారిన పడుతున్న వారి సంఖ్య తగ్గడంపై చంద్రశేఖరరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. హెచ్‌ఐవీ రోగులకు ఏఆర్టీ సెంటర్లలో ప్రభుత్వమే ఖరీదైన మందులు అందజేయడంతో పాటు, వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.3 వేలు పింఛన్ అందజేయడం వల్ల వారి జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని ఎమ్మెల్యే అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి హెచ్‌ఐవీ నివారణ నిపుణునిగా పేరొందిన డాక్టర్ మురళీకృష్ణ ఇతర జబ్బుల చికిత్సలోనూ పేదలకు అండగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పుస్తకంలో ఎంతో విలువైన సమాచారాన్ని అందించిన డాక్టర్ యనమదలను ఈ సందర్భంగా అభినందించారు.

## కలెక్టరేట్ ఉద్యోగిపై హత్యాయత్నం

కాకినాడ క్రైం: కలెక్టరేట్‌లో పౌర సరఫరాలపా విభాగంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిపై గుర్తు తెలియని వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే, కాకినాడలోని ఓల్డ్ జడ్జి క్వార్టర్స్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడ్డారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న సివిల్ సప్లైస్ క్వాలిటీ ఇన్‌స్పెక్టర్ గంటా చైతన్య వారిని నిలువరించేందుకు యత్నించాడు. ఈ నేపథ్యంలో వారిలో ఒక వ్యక్తి తన చేతిలో ఉన్న కత్తిని చైతన్య కుడి ఛాతి లోకి దించాడు. తక్షణమే వారి నుంచి తప్పించుకున్న చైతన్య కాకినాడ జీజీహెచ్‌లో చేరాడు. ఈ క్రమంలో ఆ యువకులు సదరు ఉద్యోగి మెడలో ఉన్న 12 గ్రాముల బంగారు గొలుసును లాక్కున్నట్టు ఆయన వెల్లడించారు. కుటుంబసభ్యులకు సమాచారంతో వారు అక్కడి నుంచి స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించే పనిలో పడ్డారు. సెంట్రల్ సీసీఎస్‌లో కేసు నమోదైంది.

## జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు 'కోట' విద్యార్థి

సామర్లకోట: స్థానిక బ్రాహ్మణ అగ్రహారానికి చెందిన కోరిపోలు బాబి జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో కాకినాడ పీఆర్ కళాశాలలో జరిగిన జూనియర్ కేటగిరిలో 105 కేజీల పవర్ లిఫ్టింగ్ పోటీలలో బాబి బంగారు పతకం సాధించాడు.

